క్లుప్తంగా

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

నర్సాపూర్: తెలంగాణ గిరిజన గురుకులాల విద్యాసంస్థ ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని స్థానిక ప్రతిభ గిరిజన బాలుర గురుకుల కాలేజీ ప్రిన్సిపాల్ భిక్షపతి తెలిపారు. ఆదివారం గురుకుల కాలేజీలలో చేరేందుకు ప్రవేశ పరీక్ష కేంద్రం తమ కాలేజీలో ఏర్పాటు చేశారని ఆయన చెప్పారు. ప్రవేశ పరీక్షకు 348 మంది విద్యార్థులకు గాను 335 మంది విద్యార్థులు హాజరైయ్యారని, 13 మంది గైర్హాజరైయ్యారని వివరించారు.

ముదిరాజ్‌లు ఐక్యమత్యంగా ఉండాలి


మాట్లాడుతున్న పున్నయ్య

పెద్దశంకరంపేట(మెదక్): ముదిరాజ్‌లు ఐక్యమత్యంగా ఉండాలని మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పి.పున్నయ్య అన్నారు. ఆదివారం పెద్దశంకరంపేట మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్‌లందరూ కలిసి తమ హక్కులను సాధించుకునేందుకు కృషి చేయాలన్నారు. మండలంలో ముదిరాజ్ సంఘం బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన ముదిరాజ్‌లు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ప్రారంభం


లైట్లను ప్రారంభిస్తున్న దృశ్యం

రేగోడ్(మెదక్): మండలంలోని జగిర్యాల గ్రామానికి ఎంపీ బీబీ పాటిల్ హైమస్ట్ లైట్ మంజూరు చేశారు. ఈ లైట్‌ను ఆదివారం సర్పంచ్ నర్సింలు, టీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు రమేశ్ తదితరులు లైట్ వేసి ప్రారంభించారు. దీంతో ఎంపీ బీబీ పాటిల్‌కు ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ రాములు, వార్డు సభ్యుడు మోతీరాం, మాజీ ఎంపీటీసీ భూమయ్య, టీఆర్ఎస్ నాయకుడు సత్యాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం


ఆర్థికసాయం అందిస్తున్న శ్యాంరెడ్డి

రామాయంపేట(మెదక్): మండలంలోని కాట్రియాలకు చెందిన మహిళ ఇటీవల మృతి చెందింది. ఆమె కుటుంబానికి డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి ఆర్థిక సాయం ప్రకటించారు. ఈమేరకు పార్టీ మండల అధ్యక్షుడు శ్యాంరెడ్డి బాధిత కుటుంబానికి ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ద్యాగల శ్యాములు, ఉపాధ్యక్షుడు చింతల సత్యం, ఇతర నాయకులు నాగులు, సుధాకర్‌రెడ్డి, రాజు, మల్లేశం, మద్ది శ్యాములు, బాబు, సంజీవులు, రాములు పాల్గొన్నారు.

కూచారంలో కొనసాగుతున్న స్వచ్ఛభారత్


చెత్తను సేకరిస్తున్న యువకులు

మనోహరబాద్(తూప్రాన్): మండలంలోని కూచారం గ్రామంలో నేచర్ ఐకాన్‌యూత్ వారం వారం స్వచ్ఛభారత్ చేపడుతున్నారు. ఆదివారం 256వ వారం స్వచ్ఛభారత్ చేపట్టి హరితహారంలో ప్లాస్టిక్, చెత్త చెదారాన్ని తొలగించారు. అనంతరం మొక్కల పాదులను శుభ్రం చేసి నీటిని పోశారు. గ్రామ యువకులకు చిన్నారులు సైతం స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తూప్రాన్: మండలంలోని మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో ఆదివారం 1వ వార్డులోని గాంధీ విగ్రహం వద్ద స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ అమర్ సింగ్‌తో పాటు వైద్య సిబ్బంది, గ్రామస్తులతో పాటు పాల్గొని పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పంజాల వెంకటమ్మ, పంచాయతీ పాలకవర్గ సభ్యులు శ్రీనివాసరెడ్డి, అంగన్‌వాడీ టీచర్ లావణ్య, ఆశవర్కర్ ఇందిరా, శకుంతల, మేకిన్ యువత, పంచాయతీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

మర్పల్లిలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్

- గృహాల్లో కాలిపోయిన మీటర్లు, టీవీలు, రిఫ్రిజిరేటర్లు
- ఇళ్ల నుంచి పరుగులు పెట్టిన జనం


కాలిపోయిన విద్యుత్ మీటర్


మర్పల్లిలో కాలిపోయిన రిఫ్రిజిరేటర్, ఐఫోన్ చార్జర్‌ను చూపిస్తున్న బాధితుడు

రేగోడ్(మెదక్): నిద్రపోయే సమయంలో కరెంట్ పోయి మళ్లీ వచ్చింది. ఇంతలో ఇళ్లల్లో విద్యుత్ మీటర్లు, బల్బులు, టీవీలు, రిఫ్రిజిరేటర్లు, ఫోన్ చార్జర్లు కాలిపోయాయి. దీంతో ఏం జరుగుతుందోనని ప్రజలు ఇళ్లల్లో నుంచి బయటకు పరుగులు పెట్టారు. రాత్రంతా భయందోళనలకు గురైయ్యారు. ఈ సంఘటన మెదక్ జిల్లా రేగోడ్ మండలంలోని మర్పల్లి గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మర్పల్లి గ్రామంలో శనివారం రాత్రి కరెంట్ పోయి మళ్లీ వచ్చింది. వచ్చిన వెంటనే ఇళ్లల్లో టీవీలు, విద్యుత్ మీటర్లు, రిఫ్రిజిరేటర్లు, సెల్‌ఫోన్ చార్జర్‌లు, బల్బులు, ఫ్యాన్‌లు కాలిపోయాయని స్థానికులు తెలిపారు. ఇదే క్రమంలో విద్యుత్ సర్వీస్ వైర్లు తెగి కింద పడ్డాయి. పశువులు అరుస్తూ కేకలు వేశాయి. ఒక్కసారిగా ఏం జరుగుతుందో తెలియక అందోళనతో భయంగా ఇళ్ల నుంచి ప్రజలు బయటకు పరుగులు పెట్టారు. ఆదివారం సుమారు పది గృహాలకు కరెంట్ సరఫరా లేక ఇబ్బందులు పడ్డామని స్థానికులు తెలిపారు. ఎల్‌సీ తీసుకొని మళ్లీ ఇచ్చే క్రమంలో జరిగిందా..? ఇంకా ఏమైనా కారణాలు ఉన్నాయా అనేది ప్రశ్నార్థకంగా మారింది. విద్యుత్ సరఫరా సమయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉన్నా.. నిర్లక్ష్యంగా వ్యవహరించారా..? అని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇంతగా జరిగినా ప్రాణనష్టం జరగకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. జరగరానిది జరిగితే ఎవరు బాధ్యత వహించాల్సి వచ్చేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత జిల్లా అధికారులు ఈ సంఘటనపై విచారణ జరిపించాలని స్థానికులు కోరుతున్నారు.

రిఫ్రిజిరేటర్ పని చేయడం లేదు



శనివారం రాత్రి ఏం జరిగిందో ఏమో గానీ మా ఇంట్లో రిఫ్రిజిరేటర్, విద్యుత్ మీటర్, ఐ ఫోన్ చార్జర్ కాలిపోయి పని చేయడం లేదు. ఫ్రిజ్ మరమ్మతుల కోసం మెకానిక్‌ని అడిగితే రూ.5వేలు ఖర్చు అవుతాయి అంటున్నాడు. అధికారులు స్పందించి నష్టపరిహారం ఇవ్వాలి.

– అనసూజ, మర్పల్లి, గ్రామస్తురాలు

భయం వేసింది



గ్రామంలో విద్యుత్ తీగలకు మెరుపులు మెరుస్తూ భయానక వాతావరణం నెలకొంది. ఎం జరుగుతుందో ఊహించలేని పరిస్థితి. పశువులు కేకలు వేస్తూ ఎగిరి గంతులు వేస్తున్నాయి. ఇళ్లల్లో ఉన్న జనం బయటకు పరుగులు పెట్టారు. అంతలోనే విద్యుత్ మీటర్లు, ఫ్రిడ్జ్‌లు, టీవీలు కాలిపోయాయి. కొద్దిసేపు గ్రామంలో ప్రజలందరూ చాలా భయపడ్డారు.

– సాయిరెడ్డి, మర్పల్లి

ఎలా జరిగిందో తెలియదు

మర్పల్లి గ్రామంలో విద్యుత్ ప్రమాదం ఎలా జరిగిందో తెలియదు. కానీ కొన్ని మీటర్లు, టీవీలు కాలిపోయాయి. శనివారం రాత్రే గ్రామంలో విద్యుత్ సరఫరాను మళ్లీ పునరుద్ధరించాం. అసలు విషయం తెలుసుకొని చర్యలు తీసుకుంటాం.

– కిషన్, విద్యుత్ లైన్‌మెన్

పరీక్షలపై భయాందోళన వీడాలి


అవగాహన కల్పిస్తున్న సైకాలజిస్ట్ కిషోర్‌కుమార్

జూనియర్ సైకాలజిస్ట్ కిషోర్‌కుమార్

టేక్మాల్(మెదక్): విద్యార్థులు పరీక్షలంటే భయపడకుండా రాయాలని జూనియర్ సైకాలజిస్ట్ కిషోర్ కుమార్ తెలిపారు. ఆదివారం మండలంలోని దనూర ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు ఉదయం ఐదు గంటలకే నిద్ర లేచి చదవడం ద్వారా బాగా గుర్తుంటుందని తెలిపారు. విద్యార్థులు పరీక్ష సమయంలో మొబైల్, టీవీలు వాడొద్దని సూచించారు. సులువైన విషయం నుంచి కఠిన విషయాలు చదవాలన్నారు. రాత్రిపూట భోజనం చేయగానే 30 నిమిషాలు నడవాలన్నారు. ఇతర విద్యార్థులతో పోలిక పెట్టుకోకూడదని తమకంటూ సొంత సామర్థ్యం ఉంటుందని తెలియజేశారు. పరీక్షలపై భయాందోళనలు వద్దని, ఏకాగ్రత కోసం ధ్యానం, వ్యాయామం లాంటివి చెయ్యాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంజీవయ్య, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ శాంతయ్య, వీవీలు శ్రీకాంత్ లింగమయ్య విద్యార్థులు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ


విద్యార్థులతో ఎస్ఐ సందీప్‌రెడ్డి, తదితరులు

మనోహరాబాద్(తూప్రాన్): కరాటేను ఆత్మరక్షణకు ఉపయోగించుకోవాలని, కరాటేతో ఆత్మవిశ్వాసం వస్తుందని ఎస్ఐ సందీప్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కాళ్ళకల్‌లో సన్‌షైన్ షోటోకాన్ కరాటే క్లబ్ ఆధ్వర్యంలో గ్రాండ్ మాస్టారు నర్సింగ్ రావు, క్లబ్ మాస్టారు మల్లేశ్ నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ పోటీల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఐ సందీప్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరాటే క్లబ్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ మల్లేశ్‌లతో కలిసి గ్రేడింగ్ పోటీలను తిలకించి, బెల్టులను అందజేశారు. ఈ పోటీల్లో పలు గ్రామాలకు చెందిన 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు శ్రీశైలం, నరేష్, రాంచందర్, నాయకులు నర్సింహచారి, చంద్రయ్య, వెంకటేష్, రాహుల్‌రెడ్డి, నాగరాజుగౌడ్, గోపాల్, నాగేష్, నరేందర్‌రెడ్డి, ప్రేమ్ పాల్గొన్నారు.

‘బండి సంజయ్‌ను అరెస్ట్ చేయాలి’


టేక్మాల్(మెదక్): ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

టేక్మాల్(మెదక్): ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను అరెస్ట్ చేయాలని ఎంపీపీ చింత స్వప్న డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రం టేక్మాల్ పోలీస్‌స్టేషన్ ఎదుట బండి సంజయ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎస్ఐ లింగంకు బండిసంజయ్‌పై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేయాలని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాయికోటి సుప్రజా, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వీరప్ప, జాగృతి జిల్లా అధ్యక్షురాలు మల్లిక, మాజీ సర్పంచ్ భక్తుల వరలక్ష్మి, మహిళా నాయకురాలు కల్పన, మాజీ ఎంపీటీసీ సిద్ధయ్య, నాయకులు అశోక్, సుధాకర్, సాయి, నరేష్, మాణిక్యం, విఠల్, హన్మాగౌడ్, బాలకిష్టయ్య, అజీజ్ తదితరులు ఉన్నారు.

అల్లాదుర్గంలో..

అల్లాదుర్గం(మెదక్): ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై బీఆర్ఎస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ అల్లాదుర్గం చౌరస్తాలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. బల్‌రాంరెడ్డి, సుభాశ్, అశోక్‌గౌడ్, విశ్వేశ్వర్, నర్సింలు, శివరాం, సాయిబాబా, భూమయ్య పాల్గొన్నారు.

నేడు మండలంలో ప్రజాప్రతినిధుల పర్యటన

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని గోమారం గ్రామంలో సోమవారం రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పర్యటించనున్నారని సర్పంచ్ లావణ్య తెలిపారు. గ్రామంలోని అభివృద్ధి పనులు ప్రారంభిస్తారని చెప్పారు. సోమవారం ఉదయం 10 గంటలకు జరుగే కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకావాలని కోరారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి సంక్షేమ పథకాలు


మనోహరాబాద్(తూప్రాన్): వడ్డీ రుణాల పత్రాలను అందిస్తున్న సర్పంచ్ నాగభూషణం


నర్సాపూర్ రూరల్: వడ్డీ పత్రాలను అందిస్తున్న ఎంపీపీ వెంకట నర్సింగరావు

మనోహరాబాద్(తూప్రాన్): మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని సర్పంచ్ నాగభూషణం అన్నారు. ఆదివారం మండలంలోని రంగాయపల్లి గ్రామ పంచాయతీ వద్ద గ్రామ మహిళా సమైఖ్య సభ్యులకు ప్రభుత్వం అందించే వడ్డీ మాఫీ రుణాల పత్రాలను అందజేశారు. ప్రభుత్వం మహిళలకు స్వయం ఉపాధి కోసం రుణాలను సైతం అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమైఖ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నర్సాపూర్ రూరల్: పావుల వడ్డీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని నర్సాపూర్ ఎంపీపీ వెంకట నర్సింగరావు మహిళా సంఘాల సభ్యులకు సూచించారు. ఆదివారం మండలంలోని పెద్ద చింతకుంట గ్రామంలో సర్పంచ్ గుండె శివకుమార్‌తో కలిసి మహిళలకు పావలా వడ్డీ రుణాలకు సంబంధించిన పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఓఏ కవిత, ఆయా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న దృశ్యం

టేక్మాల్(మెదక్): మండలంలోని తంప్లూర్ గ్రామంలో ఆదివారం ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. సర్పంచ్ సంగయ్య, ఎంపీటీసీ భూమయ్య, నాయకులు మల్లేశం, బాలరాజ్, రమేశ్, సంతోశ్, అశోక్, సాయిలు, రజాక్, లక్ష్మయ్య, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

‘సమస్యలు పరిష్కరించాలి’

మెదక్ రూరల్: ఆర్టీసీ, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ఈపీఎస్ పెన్షన్ దారుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యమం చేస్తామని జాతీయ సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎండీ జహీరుద్దీన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈపీఎస్ 95 పెన్షన్ దారులందరికి పెన్షన్, డీఏ, వైద్య సదుపాయాలను కల్పించాలన్నారు. రాష్ట్ర పబ్లిసిటీ కార్యదర్శి ఎస్.కే.మూర్తి, రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సుబ్బారావు, డిపో అధ్యక్ష, కార్యదర్శులు రాజానందం, సిద్ధిరాములు ఉన్నారు.


ముస్తాబవుతున్న చాకరిమెట్ల ఆలయం

ఆలయానికి కొత్త శోభ

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి ఆలయం రంగులు వేస్తుండడంతో కొత్తశోభ సంతరించుకుంది. దాతల సహాయంతో ఆలయ శిఖరంతో పాటు లోపల ఉన్న వివిధ దేవత మూర్తులను వివిధ రకాల రంగులతో ముస్తాబు చేస్తున్నారు. సుమారు 3 లక్షల 50 వేల నిధులతో ఆంజనేయ స్వామి ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ తెలిపారు. ఎదుల్లాపూర్ సర్పంచ్ కల్లూరి కీర్తనహన్మంత్‌రావుతో పాటు పలువురు దాతల సహాయంతో రంగులు వేస్తున్నట్లు చెప్పారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం


శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తిలో సుమారు 700 సంవత్సరాల క్రితం వెలసిన రాజరాజేశ్వరి దేవాలయంలో ఆదివారం విశేష పూజలు, శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను డప్పుచప్పుళ్లతో ప్రధాన వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయానికి చేరుకొని కల్యాణం నిర్వహించారు. భక్తులు నూతన దంపతులకు ఒడి బియ్యం పోసి, మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు తీర్థపదార్థాలు అందజేశారు.

కనుల పండువగా వినాయక ఆలయ వార్షికోత్సవం


హోమం నిర్వహిస్తున్న భక్తులు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో వెలసిన శ్రీ వరసిద్ధి వినాయక ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా జరిగాయి. ఆదివారం మండల కేంద్రంలోని సోమేశ్వరాలయ సమీపంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వేదపండితుల ఆధ్వర్యంలో భక్తులు జాల రవికుమార్, వెంకట్‌రామ్‌రెడ్డి, సత్యంగుప్తా దంపతులు గణపతి హోమం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు తీర్థప్రసాద వితరణ, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వనం నర్సింలు, లక్ష్మారెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.

ప్రారంభమైన పెద్దమ్మ జాతర


పెద్దమ్మ తల్లికి పూజలు చేస్తున్న భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లి జాతర ఆదివారం కనుల పండువగా ప్రారంభమైంది. మొదటి రోజు పెద్దమ్మ తల్లికి అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ నెల 14 వరకు జాతర జరుగుతుందని సర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

రాయిలాపూర్‌లో మల్లన్న ఉత్సవాలు


బండ్లను ఊరేగిస్తున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని రాయిలాపూర్‌గేట్ వద్ద మల్లికార్జునస్వామి, రేణుకా ఎల్లమ్మ 15వ ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం ఆలయ నిర్మాత శామీర్‌పేట నర్సింగారావు మల్లన్న కల్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం బండ్లను ఊరేగించి దేవతామూర్తులకు బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో రాయిలాపూర్, నాగ్సాన్‌పల్లి సర్పంచ్‌లు శేఖులు, ఎల్లం, వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన


ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న దృశ్యం

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని సీతారామ ఉమామహేశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రెండోరోజు ఆదివారం ఉదయం గురుప్రార్థన, గోపూజ, శాంతి పాఠము, స్థాపిత దేవతా ప్రాతఃకాలపూజ, జప పారాయణములు, నవగ్రహ మండల దేవతాహోమం, మూర్తి మూర్త్యధిపతి లోకపాలదేవతాస్థాపన హోమం, ప్రధాన దేవతా, ఇతర దేవతా మూల మంత్ర హవనం, ధాన్యాధివాసం, శిఖర ధ్వజ సంస్కారములు తదితర పూజా కార్యక్రమాలను ఆలయ ధర్మకర్తలు రుక్మాభట్ల కృష్ణమూర్తి, విఠాల సాయికృష్ణశర్మ, దేశపతి రాజశేఖరశర్మ, ఆలయ అర్చకులు బీటుకూరి శ్రీనివాసాచార్యులు, మఠం శివకుమార్, నవీన్‌లతో పాటు చాడనందబాలశర్మ, వేదపండితుల ఆధ్వర్యంలో వైష్ణవ, శైవ సంప్రదాయాల్లో నిర్వహించారు. అదేవిధంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఉత్సవాలకు హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.